
సాక్షి గుంటూరు

శనివారం ; 29 ; మార్చి ; 2025



రేపు బాబా మందిర వార్షికోత్సవం

క్రోసూరు: స్థానిక షిర్డీ సాయిబాబా మందిరం 25వ వార్షికోత్సవం ఆదివారం జరుగుతుందని ఆలయ కమిటీ అధ్యక్షుడు మన్నెం వెంకట్రావు శుక్రవారం తెలిపారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటి మట్టం శుక్రవారం 521.60 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు 6,041 క్యూసెక్కులు విడుదలవుతోంది.

నగరోత్సవానికి వెండి రథం సిద్ధం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఉగాది నాడు ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గా మల్లేశ్వరస్వామి వార్లకు నిర్వహించే వెండి రథోత్సవానికి సర్వం సిద్ధమైంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని వెండి రథానికి సిబ్బంది శుక్రవారం మెరుగులు దిద్దారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (శని)	సహర్ (ఆది)
గుంటూరు	6.25	4.48
నరసరావుపేట	6.27	4.50
బాపట్ల	6.25	4.48

పారదర్శకత గోవిందా..!

- చోరీ అభియోగం ఎదుర్కొన్న ఉద్యోగినికి మళ్లీ పోస్టింగ్
- వైకుంఠపురం దేవస్థానంలో వింత పోకడ
- ఇంకా పెండింగ్‌లోనే కోర్టు కేసు
- అయినా పట్టించుకోని ఉన్నతాధికారులు



కె.నిర్మలారాణి



తెనాలి: దేవుని హుండీ లెక్కింపులో బంగారు ఉంగరాన్ని చేతికి తొడుక్కుని చోరీ నేరానికి పాల్పడినట్టు అభియోగం ఎదుర్కొన్న ఉద్యోగినికి మళ్లీ అదే ఆలయంలోకి అధికారులు రెడ్ కార్పెట్ పరిచారు. పోలీసు కేసు ఇంకా కోర్టులో పెండింగులోనే ఉంది. అయినా అధికారులు మాత్రం పోస్టింగ్ ఇచ్చేశారు. అదేమంటే ఉన్నతాధికారుల ఆదేశాలు అంటున్నారు. వివరాలిలా ఉన్నాయి. పట్టణంలో ప్రసిద్ధి చెందిన వైకుంఠపురంలోని శ్రీలక్ష్మీపద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో 2023 జూలై 12న జరిగిన హుండీ లెక్కింపులో నాటి ఆలయ సూపరింటెండెంట్ కె.నిర్మలారాణి చేతివాటం ప్రదర్శించారు. హుండీ కానుకల్లో వచ్చిన నగదును లెక్కించాక, బంగారు, వెండి ఆభరణాలను వేరు చేసేటప్పుడు బంగారు ఉంగరం ఒకదాన్ని తీసి, ఆమె తన చేతివేలుకు పెట్టుకున్నారు. అక్కడే ఉన్న మహిళా భక్తురాలు ఇచ్చిన సమాచారంతో అప్పటి ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి తిమ్మనాయుడు విచారణ చేపట్టారు. స్టేట్‌మెంట్లను రికార్డు చేశారు. నిర్మలారాణిని అక్కడికక్కడే సస్పెండ్ చేశారు. అంతేకాకుండా స్థానిక వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. నిర్మలారాణి యాంటిసిపేటరీ బెయిల్‌కు దరఖాస్తు చేశారు. కోర్టు ఆదేశంపై పోలీసులు 41 నోటీసు ఇచ్చారు. పోలీసుల యాక్షన్‌పై నిందితురాలి తరఫు వారు అప్పట్లో ఎస్పీకి ఫిర్యాదు చేశారు. తాము తెలుగుదేశం పార్టీ సానుభూతిపరులం అయినందున కావాలని సస్పెండ్ చేసి, కేసు నమోదుచేశారని ఆరోపించారు. దీనిపై అప్పటి ఎస్పీ ప్రత్యేకంగా అదనపు ఎస్పీని విచారణకు పంపారు. తెనాలి వచ్చిన అదనపు ఎస్పీ దర్యాప్తును తీరును పరిశీలించారు. దేవాలయ అధికారులు తగిన స్టేట్‌మెంట్లతో సహా ఇచ్చిన ఫిర్యాదుపైనే కేసు నమోదైందని తెలుసుకున్నారు. ఎలాగైతేనేం, సీఆర్‌పీసీ సెక్షన్ 114/23 కింద నమోదైన కేసులో పోలీసులు చార్జిషీటు దాఖలు చేశారు. ప్రస్తుతం ఆ కేసు కోర్టులో పెండింగులో ఉంది.

ఈఓ బదిలీపై వెళ్లగానే..

అదలా ఉండగానే గతేడాది సెప్టెంబరులో వైకుంఠపురం ఆలయ సహాయ కమిషనర్, ఈవో తిమ్మనాయుడు బదిలీపై వెళ్లారు. ఈ నేపథ్యంలో కొద్దిరోజుల క్రితం వైకుంఠపురం ఆలయ సూపరింటెండెంట్‌గా కె.నిర్మలారాణికి ఉన్నతాధికారులు పోస్టింగ్ ఇచ్చారు. ఆమె మళ్లీ బాధ్యతల్లోకి రావడంపై ఆలయ సిబ్బంది, భక్తులు ముక్కున వేలేసుకుంటున్నారు. అభియోగాలున్న వ్యక్తికి మళ్లీ అదే ఆలయంలో పోస్టింగు ఇవ్వటాన్ని విమర్శిస్తున్నారు. అంతకుముందు పెదకాకాని ఆలయంలో పనిచేస్తున్నప్పుడు కూడా నిర్మలారాణి హుండీ లెక్కింపు సందర్భంగా నగదు తస్కరించినట్టు అభియోగం వచ్చింది. దీనిపై ఆమెను అప్పట్లో విధుల నుంచి తప్పించారు. విచారణాధికారి నివేదిక తర్వాత మళ్లీ విధుల్లోకి తీసుకున్నారు. వైకుంఠపురం ఆలయానికి బదిలీ చేశారు. ఇక్కడా అలాంటి ఆరోపణలతోనే సస్పెన్షన్, కేసు ఎదుర్కొనాల్సివచ్చింది. ఇప్పుడు మళ్లీ బాధ్యతల్లోకి వచ్చారు.

చోరీ నిరూపణ కాలేదు..!

వైకుంఠపురం దేవస్థానంలో హుండీ లెక్కింపులో నిర్మలారాణి బంగారు ఉంగరం అపహరించినట్టు వచ్చిన అభియోగం నిరూపణ కాలేదు. దీనిపై నలుగురు అధికారులం విచారణ చేసి నిర్ధారించుకున్నాం. ఆమె పోస్టింగ్ విషయం మా పరిధిలోనిది కాదు.

– కేబీ శ్రీనివాస్, డిప్యూటీ కమిషనర్, దేవదాయశాఖ

కార్పొరేటర్లతో వైఎస్సార్ సీపీ నేతల భేటీ

నేడు జీఎంసీ బడ్జెట్ సమావేశం నేపథ్యంలో చర్చ



సమావేశంలో అంబటి, మోదుగుల, నూరి ఫాతిమా, డైమండ్‌బాబు, కార్పొరేటర్లు

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): కార్పొరేషన్ బడ్జెట్ సమావేశంలో ప్రజల పక్షాన వాణిని వినిపించాలని వైఎస్సార్ సీపీ నేతలు కార్పొరేటర్లకు సూచించారు. శనివారం కార్పొరేషన్ బడ్జెట్ సమావేశం జరగనున్న నేపథ్యంలో బృందావన్ గార్డెన్స్ లోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరి ఫాతిమా, డెప్యూటీ మేయర్, తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు (డైమండ్ బాబు) కార్పొరేటర్లతో సమావేశమయ్యారు. బడ్జెట్ సమావేశంలో ప్రవేశపెట్టనున్న ఎజెండా అంశాలు, పూర్తిస్థాయి ఖర్చుల వివరాలపై అధికారులను అడిగి తెలుసుకోవాలని సూచించారు. బడ్జెట్ అంకెల గారడీని తలపించేలా ఉందా, వాస్తవాలకు దూరంగా అధికార యంత్రాంగం వ్యవహరిస్తుందా అనే అంశంపై నిలదీయాలని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమాన్ని కాంక్షించే పార్టీగా అధికారుల తప్పులపై నిలదీయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అధికారులు వ్యవహరిస్తున్న ఏకపక్ష ధోరణిపైన ఏమాత్రం వెనకడుగు వేయకుండా ప్రజల పక్షాన పోరాడాలన్నారు. అంకెలతో మాయ చేసి ఆమోదించేందుకు వ్యవహరిస్తున్నారా అనే అంశాన్ని ప్రజల దృష్టికి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికే బడ్జెట్‌పై పూర్తిస్థాయిలో భిన్నాభిప్రాయాలు ఆయా వర్గాల నుంచి వ్యక్తమవుతున్న నేపథ్యంలో దీనిపై దృష్టి సారించి ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణ, కార్పొరేటర్లు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

పారిశ్రామిక ప్రగతితో జిల్లా అభివృద్ధి

గుంటూరు వెస్ట్: పారిశ్రామిక ప్రగతితో జిల్లా అభివృద్ధి సాధ్యమని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి చెప్పారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా ఇండస్ట్రియల్, ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ 2025–26 ఆర్థిక సంవత్సరంలో జీపీవీఏ గ్రోత్ లక్ష్యానికి అనుగుణంగా పరిశ్రమల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. పరిశ్రమల స్థాపనకు ఔత్సాహికులను ప్రోత్సహించాలన్నారు. ఎంఎస్ఎంఈ లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సబ్సిడీల గురించి వివరించాలన్నారు. రానున్న ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో 70,000, అర్బన్ ప్రాంతాల్లో 70 వేల మందిని లఖ్‌పత్ దీదీలుగా తయారు చేసేందుకు కృషి చేయాలన్నారు. మంగళగిరిలో హ్యాండ్లూమ్ క్లస్టర్ ఏర్పాటుకు ఎండోమెంట్ స్థలాలు లీజు ద్వారా సత్వరమే కేటాయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 32 ఎంఎస్ఎంఈలకు రూ.1.86 కోట్లు చెల్లించేందుకు కలెక్టర్ ఆమోదముద్ర వేశారు. సమావేశంలో పరిశ్రమల శాఖ జీఎం ఎ.విజయలక్ష్మి, లీడ్ బ్యాంక్ మేనేజర్ రత్న మహీపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ఏప్రిల్ నెలాఖరులోపు ఈ-కేవైసీ చేయించుకోవాలి

డీఎస్‌ఓ కోమలి పద్మ



గుంటూరు వెస్ట్: జిల్లాలోని రేషన్‌కార్డుదారులందరూ ఏప్రిల్ చివరి నాటికి ఈ-కేవైసీ చేయించుకోవాలని డీఎస్‌ఓ కోమలి పద్మ శుక్రవారం తెలిపారు. జిల్లాలో 5.99 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయని పేర్కొన్నారు. ఇప్పటికే 4.70 లక్షల మంది ఈ-కేవైసీ చేయించుకున్నారని వివరించారు. గత 10 రోజుల్లోనే సుమారు 10 వేల మంది కార్డుదారులు ఈ-కేవైసీ చేయించుకున్నారని వివరించారు. ఈ-కేవైసీ చేయించుకోలేకపోతే మే 1 నుంచి రేషన్ ఆపేస్తామని స్పష్టం చేశారు.

మిర్చి యార్డుకు నేటి నుంచి వరుస సెలవులు

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం నుంచి వరుసగా మూడు రోజులు పాటు సెలవులు ప్రకటించారు. శని, ఆదివారాలు యార్డుకు సాధారణ సెలవులు, సోమవారం రంజాన్ పండగను పురస్కరించుకుని మిర్చి యార్డుకు మూడు రోజులపాటు సెలవులు ప్రకటించినట్టు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు తమ సరుకును యార్డుకు తీసుకురావద్దని కోరారు. సోమవారం అర్ధరాత్రి నుంచి రైతుల సురుకును యార్డులోకి అనుమతిస్తామని పేర్కొన్నారు. మంగళవారం యథావిధిగా యార్డులో క్రయ విక్రయాలు కొనసాగుతాయని ఆమె వివరించారు.

శ్రీరామ పట్టాభిషేక అలంకారం



మంగళగిరి టౌన్ : మంగళాద్రిలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆస్థాన అలంకారోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం స్వామి భక్తులకు శ్రీరామ పట్టాభిషేకం అలంకారంలో దర్శనమిచ్చారు. ఉత్సవ కైంకర్యపరులుగా గుంటూరుకు చెందిన కారుమంచి మురళీసాయి, సోదరులు, ఆస్థాన కైంకర్యపరులుగా మంగళగిరి పట్టణానికి చెందిన యేనుగ కిషోర్ కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఏర్పాట్లను ఆలయ ఈవో రామకోటిరెడ్డి పర్యవేక్షించారు.

ట్రాఫిక్ పోలీసులకు టోపీలు, కళ్లజోళ్లు



నగరంపాలెం(గుంటూరు వెస్ట్): ఈ వేసవిలో ఎండ తీవ్రత దృష్ట్యా ట్రాఫిక్ విధులు నిర్వర్తించే పోలీస్ అధికారులు, సిబ్బందికి టోపీలు, కళ్లజోళ్లు ఉపయోగపడతాయని ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ట్రాఫిక్ సీఐలు, ఎస్ఐలు, సిబ్బందికి టోపీలు, కళ్లజోళ్లను అందించారు. గ్రేటర్ వాసవి క్లబ్ గుంటూరు తరఫున సుమారు 200 టోపీలు, కళ్ళజోళ్లను అందించిన సీహెచ్ శేఖర్, కొత్తూరు. అశోక్, కొత్తూరు హేమంత్‌లను జిల్లా ఎస్పీ అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో శిక్షణ ఐపీఎస్ అధికారిణి దీక్ష, ట్రాఫిక్ డీఎస్పీ రమేష్, సీఐలు ఎ.అశోక్‌కుమార్ (తూర్పు), సింగయ్య (పశ్చిమ), ఎస్ఐలు రవీంద్రబాబు, శ్రీహరి పాల్గొన్నారు.

టెన్త్ సోషల్ పరీక్ష ఏప్రిల్ 1కి వాయిదా

రంజాన్ పండగ సెలవు దృష్ట్యా మార్పు

గుంటూరు ఎడ్యుకేషన్: రంజాన్ పండగను పురస్కరించుకుని ఈనెల 31న ప్రభుత్వం సెలవు ప్రకటించిన దృష్ట్యా ఆ రోజు జరగాల్సిన పదో తరగతి సోషల్ పరీక్షను ఏప్రిల్ ఒకటో తేదీకి వాయిదా వేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు గమనించాలని సూచించారు.

పాలనా పదవుల్లో సామాజిక న్యాయం

- ఏఎన్‌యూ పాలకమండలి సమావేశంలో నిర్ణయం
- వర్సిటీ వార్షిక బడ్జెట్‌కు ఆమోదం
- ఉద్యోగ విరమణ వయస్సుపై చర్చ



ఏఎన్‌యూ(గుంటూరు): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో శుక్రవారం వీసీ కె.గంగాధరరావు అధ్యక్షతన పాలకమండలి సమావేశం జరిగింది. సమావేశంలో కీలక నిర్ణయాలను తీసుకున్నారు. ఆర్థిక, విద్యాపర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. అందిన సమాచారం మేరకు వర్సిటీ వార్షిక బడ్జెట్‌కు పాలకమండలి ఆమోదం తెలిపింది. వర్సిటీ ఉద్యోగ విరమణ వయస్సుపై ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకోవాలని సమావేశంలో చర్చించారు. ఎన్నో ఏళ్లుగా అకడమిక్ కౌన్సిలర్లుగా విధులు నిర్వహిస్తున్న వారికి అసిస్టెంట్ ప్రొఫెసర్ హోదా ఇవ్వాలనే ప్రతిపాదనపై సుదీర్ఘ చర్చ జరిగింది. లాంగ్వేజ్ ల్యాబ్ ఇన్‌స్ట్రక్టర్ హోదాను అసిస్టెంట్ ప్రొఫెసర్ హోదాగా మార్పు చేయాలనే దానిపైనా చర్చ జరిగింది. దూర విద్య కేంద్రంలో ఐసీటీ డైరెక్టర్ పోస్టు భర్తీ కోసం నోటిఫికేషన్ జారీ చేసిన విషయంపై పాలకమండలి సానుకూలంగా స్పందించింది. వర్సిటీలో పాలనపరమైన పదవులకు సామాజిక న్యాయం పాటించలేదని పలువురు సభ్యులు లేవనెత్తగా సామాజిక న్యాయం పాటిస్తామని అధికారులు చెప్పినట్లు సమాచారం. వికాస ఉద్యోగుల రుణ పరిమితి పెంపుపై చర్చించారు. ఇంజినీరింగ్ కళాశాలలో శానిటేషన్‌ను ప్రైవేట్ సంస్థకు కాంట్రాక్టు ఇచ్చే విధానంపై సభ్యులు కొందరు ప్రశ్నించగా ఆ కాంట్రాక్టును నోటిఫికేషన్ లేదా టెండర్ ద్వారా ఖరారు చేయాలని పాలకమండలి సభ్యులు సూచించారు. అనంతరం రూ.6.37 కోట్ల లోటుతో వార్షిక బడ్జెట్‌కు ఆమోదం తెలిపారు. దినసరి వేతన ఉద్యోగులను ఎన్ఎంఆర్లుగా మార్చేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని నిర్ణయించారు. సమావేశంలో రెక్టార్ ఆచార్య రత్న షీలా మణి, రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం, స్థానిక పాలక మండలి సభ్యులు సుమంత్ కుమార్, జగదీష్ నాయక్, వెంకటేశ్వరరావు, సాహెదా అక్తర్ పాల్గొన్నారు.

సీసీ కెమెరాల పనితీరుపై ప్రజలకు అవగాహన

ఐజీ హరికృష్ణ



మాట్లాడుతున్న ఐజీ హరికృష్ణ, చిత్రంలో ఎస్పీ సతీష్‌కుమార్ తదితరులు

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): జిల్లాలోని ప్రతి పోలీస్‌స్టేషన్ల పరిధిలో సీసీ కెమెరాల పర్యవేక్షణ బాధ్యత సీఐలపై ఉందని జిల్లా నేర సమీక్ష నిర్వహణ ప్రత్యేకాధికారి, ఐజీ హరికృష్ణ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని హాల్‌లో శుక్రవారం నేర సమీక్ష సమావేశం (మార్చి–2025) నిర్వహించారు. నేరాల పరిశోధన, నియంత్రణ కోసం చేపట్టాల్సిన చర్యలను ఐజీ హరికృష్ణ తెలియజేశారు. కేసుల వివరాలను సీసీటీఎన్ఎస్‌లో నమోదు చేయాలని, తద్వారా ఎవరైనా తరుచూ నేరాలకు పాల్పడితే అతనిపై నమోదైన కేసులను త్వరగా గుర్తించి కఠిన చర్యలు చేపట్టవచ్చునని చెప్పారు. జిల్లాలోని ప్రధాన కూడళ్లు, జన సంచారంతో రద్దీగా ఉండే ప్రదేశాలు, నేరాలు జరిగే ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజలకు సీసీ కెమెరాల పనితీరుపై అవగాహన కల్పించాలని చెప్పారు. జిల్లాలోని గ్రామాలు, కాలనీల ప్రజలతో ఫ్రెండ్లీ పోలీసింగ్ దిశగా 'వారధి ప్రోగ్రాం' నిర్వహించాలని అన్నారు. బెదిరింపులు, కిడ్నాప్‌లకు అవకాశం లేకుండా చూడాలన్నారు. పెండింగ్‌లో ఉన్న నాన్ బెయిలబుల్ వారెంట్లు జారీ చేయాలని ఆదేశించారు. మహిళలు, చిన్నారుల అదృశ్యాలు, వారిపై జరిగిన నేరాల విచారణ త్వరితగతిన చేపట్టాలని సూచించారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో పది మంది నేరస్తులు, పది మంది రౌడీషీటర్ల వివరాలు సేకరించాలని చెప్పారు. మళ్లీ వారు నేరాలకు పాల్పడకుండా నియంత్రించాలని అన్నారు. ఎస్పీ సతీషకుమార్ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపాలని చెప్పారు. చోరీలు, హత్యలు, హత్యాయత్నాల కేసుల్లో వేలిముద్రలు అరచేతి ముద్రలు, కాళ్ల మొదలు పీపీఎల్ఎస్‌లో భద్రపరచాలని అన్నారు. తద్వారా నేరాలు జరిగిన ప్రదేశాల్లో దొరికిన ఆధారాలతో నేరస్తులను వెంటనే గుర్తించవచ్చునని పేర్కొన్నారు. పలు కేసుల్లో ప్రతిభ చూపిన పోలీస్ అధికారులు, సిబ్బందికి నగదు రివార్డులను ఎస్పీ అందించారు. సమావేశంలో ఐపీఎస్ శిక్షణాధికారి దీక్ష, జిల్లా ఏఎస్పీలు జీవీ.రమణమూర్తి (పరిపాలన), కె.సుప్రజ (క్రైం), ఎస్‌బీ డీఎస్పీ సీతారామయ్య, పలువురు డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

శభాష్ తహసీల్దార్

- తెనాలి తహసీల్దార్‌కు పోలీసు ఉన్నతాధికారుల అభినందన
- విచక్షణాధికారంతో రౌడీ షీటర్‌కు రిమాండ్ విధించడంతో సత్కారం



తహసీల్దార్ గోపాలకృష్ణను సత్కరించి అభినందిస్తున్న ఐజీ హరికృష్ణ, ఎస్పీ సతీష్

తెనాలిరూరల్: శాంతి భద్రతల పరిరక్షణలో మండల మేజిస్ట్రేట్ హోదాలో రౌడీ షీటర్‌కు రిమాండ్ విధించటం చారిత్రాత్మక నిర్ణయం అని రేంజ్ ఐజీ హరికృష్ణ చెప్పారు. ఎస్పీ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో గుంటూరులో శుక్రవారం నిర్వహించిన నేర సమీక్షకు తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణను ఎస్పీ స్వయంగా ఆహ్వానించారు. ఇటీవల తెనాలిలో ఓ రౌడీ షీటర్ బైండోవర్ నిబంధనలు అతిక్రమించి మరో నేరానికి పాల్పడిన ఘటనలో అతనికి తహసిల్దార్ నేరుగా నెల రోజులు రిమాండ్ విధించారు. ఇది పోలీస్ వర్గాల్లోనూ చర్చనీయాంశమైంది. మేజిస్టీరియల్ అధికారాలను గతంలో ఏ తహసీల్దార్ ఉపయోగించని రీతిలో కచ్చితంగా అమలు చేసిన అధికారిగా గోపాలకృష్ణ గుర్తింపు పొందారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని గోపాలకృష్ణను ఐజీ హరికృష్ణ, ఎస్పీ సతీష్ కుమార్ సత్కరించారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ లా అండ్ ఆర్డర్ అమలులో తహసీల్దార్ గోపాలకృష్ణ తీసుకున్న నిర్ణయాలు అభినందనీయమన్నారు. ఎస్పీ మాట్లాడుతూ తహసీల్దార్ హోదాలో అసాంఘిక శక్తులను బైండోవర్ చేయడం సర్వసాధారణమని, అయితే రౌడీషీటర్‌కు రిమాండ్ విధించిన ఏకైక తహసీల్దార్‌గా గోపాలకృష్ణ గుర్తింపు పొందారని అభినందించారు. కార్యక్రమంలో తెనాలి డీఎస్పీ బి. జనార్ధన రావు, జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు రెవెన్యూ సిబ్బంది గోపాలకృష్ణను ప్రత్యేకంగా అభినందించారు.

వైద్య సేవలు నిలిపివేస్తాం

- రూ.3,500 కోట్ల బకాయిలు చెల్లించండి
- లేకపోతే వచ్చేనెల 7 నుంచి సేవలు నిలిపివేస్తాం
- కలెక్టర్‌కు వైద్యుల వినతి



కలెక్టర్ నాగలక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న వైద్యులు

గుంటూరు వెస్ట్: ఎన్టీఆర్ వైద్య సేవ నెట్‌వర్క్ ఆస్పత్రులకు పెండింగ్ ఉన్న రూ.3,500 కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని ఏపీ స్పెషాలిటీ హాస్పిటల్ అసోసియేషన్ (ఆషా) వైద్యులు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి శుక్రవారం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతో కాలంగా పెండింగ్ బిల్లులను చెల్లించాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నా.. స్పందించకపోవడం దురదృష్టకరమని చెప్పారు. పెండింగ్ బిల్లుల వల్ల ఆస్పత్రుల నిర్వహణ కష్టంగా మారిందని తెలిపారు. పెండింగ్ బిల్లులు చెల్లించకపోతే వచ్చేనెల 7 నుంచి ఎన్టీఆర్ వైద్య సేవ పథకం నిలిపివేస్తామని స్పష్టం చేశారు. ఈ క్రమంలో ఈనెల 30న జిల్లాలోని శాసన సభ్యులు, మంత్రులకు వినతిపత్రాలు అందజేస్తామని పేర్కొన్నారు. డాక్టర్ రాఘవ శర్మతోపాటు వైద్యులు పాల్గొన్నారు.

వేకువ వాకిట మంచు వెన్నెల



వేకువ వాకిట మంచు వెన్నెల భానుడితో దోబూచులాడిందా.. పొగచూరి చలి గిలిగింతలు పెట్టిందా. హిమ జల్లులు శిరస్సును అభిషేకించేందుకు తహతహలాడాయా.. అన్నట్టు వేసవి సమీపించినా.. సూర్యుడు ప్రతాపం చూపిస్తున్నా.. ఉదయాన్నే పొగమంచు దట్టంగా అలుముకుంటోంది. తెనాలి బుర్రిపాలెం రోడ్డులో శుక్రవారం ఎనిమిది గంటలకు తారసపడిన ఈ దృశ్యం ప్రకృతి ప్రేమికులను మైమరిపిస్తే, వాహనదారులను అసౌకర్యానికి గురిచేశాయి. - తెనాలి

పోలీసులకు ఇఫ్తార్ విందు



నగరంపాలెం(గుంటూరు వెస్ట్): స్థానిక నగరంపాలెం పోలీస్ కల్యాణ మండపంలో జిల్లాలోని పోలీస్ అధికారులు, సిబ్బందికి శుక్రవారం రాత్రి ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ విందు మత సామరస్యాన్ని చాటుతుందని, ఇందులో పాల్గొనడం ఆనందంగా ఉందని ఎస్పీ సతీష్‌కుమార్ పేర్కొన్నారు. తొలుత ఆకులవారితోట మసీద్ నుంచి విచ్చేసిన షేక్ ముఫ్తీమన్సూర్ ఆధ్వర్యంలో ముస్లింలు ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్పీ కె.సుప్రజ (క్రైం), డీఎస్పీలు బి.సీతారామయ్య (ఎస్‌బీ), అబ్దుల్‌అజీజ్ (తూర్పు), అరవింద్ (పశ్చిమ), భానోదయ (దక్షిణ), సీఐలు అల్తాఫ్‌హుస్సేన్ (సీసీఎస్), నజీర్‌బేగ్ (నగరంపాలెం పీఎస్), ఆర్ఐలు శ్రీహరిరెడ్డి, శివరామకృష్ణ, రామకృష్ణరెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గుంటూరు బార్ అధ్యక్షుడిగా శివసూర్యనారాయణ



యంగళశెట్టి శివసూర్యనారాయణ, అధ్యక్షుడు



డాక్టర్ చింతా రామకోటిరెడ్డి, వైస్ ప్రెసిడెంట్

గుంటూరు లీగల్: గుంటూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా యంగళశెట్టి శివ సూర్యనారాయణ ఎన్నికయ్యారు. జిల్లా కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నిక గురువారం జరిగిన విషయం తెలిసిందే. కౌంటింగ్ అర్ధరాత్రి వరకు కొనసాగింది. అర్ధరాత్రి 2 గంటలకు గెలుపొందిన అభ్యర్థుల పేర్లను ఎన్నికల అధికారి కాసు వెంకటరెడ్డి ప్రకటించారు. వైస్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ చింతా రామకోటిరెడ్డి, జనరల్ సెక్రటరీగా మోతుకూరి శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీగా విజయ్ వర్మ, ట్రెజరర్‌గా అశోక్ కుమార్, గూడూరి లైబ్రరీ సెక్రటరీగా శ్రీనివాసరావు బోప్ప, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా శేషగిరిరావు గండికోట, లేడీ రిప్రజెంటేటివ్‌గా పురాణం కళ్యాణి, జూనియర్ ఎగ్జిక్యూటివ్‌గా మారుతి శివనాగ ప్రసాద్, రెహానా బేగం షేక్, శివ రంగనాయకులు పెరుమాళ్ళ, లేడీ ఎగ్జిక్యూటివ్‌గా విజయ్ కుమారి మంద ఎన్నికైనట్లు ప్రకటించారు. అనంతరం 3.30 గంటలకు గుంటూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా యంగళశెట్టి శివ సూర్యనారాయణ బాధ్యతలు స్వీకరించారు.

201 ఓట్ల ఆధిక్యంతో అధ్యక్షుడి విజయం

అధ్యక్ష పదవికి పోటీచేసిన యంగళశెట్టి శివసూర్యనారాయణ 201 ఓట్ల ఆధిక్యంతో గెలిచారు. వైస్ ప్రెసిడెంట్ పదవికి ఇద్దరు పోటీ పడగా, 313 ఓట్ల తేడాతో డాక్టర్ చింతా రామకోటిరెడ్డి విజయం సాధించారు. ఇదిలా ఉంటే సీనియర్ ఎగ్జిక్యూటివ్ పదవికి ఐదుగురు పోటీ చేయగా, నలుగురు అభ్యర్థులు గెలుపొందారు. ఓడిన అభ్యర్థిని ఎగ్జిక్యూటివ్ బాడీలోకి తీసుకున్నట్లు తీర్మానం జరిగింది.

వాణిజ్యం
నిమ్మకాయల ధరలు



గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శుక్రవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **6,000** గరిష్ఠం : రూ. **7,500**

మోడల్ ధర రూ. **6,800**

క్లుప్తంగా

1,32,926 బస్తాల మిర్చి విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 1,14,566 బస్తాల మిర్చి రాగా గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,32,926 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.9,500 నుంచి రూ.14,100 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.10,000 నుంచి రూ.13,300 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.6,500 వరకు ధర పలికింది.

పసుపు ధరలు

దుగ్గిరాల: దుగ్గిరాల పసుపు యార్డులో శుక్రవారం 323 బస్తాలు వచ్చాయి. పసుపు మొత్తం అమ్మకం చేసినట్లు వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యదర్శి ఎస్.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. కొమ్ములు 232 బస్తాలు వచ్చాయి. వాటి కనిష్ఠ ధర రూ.10,200 గరిష్ఠ ధర రూ.10,600 మోడల్ ధర రూ.10,350, కాయలు 91 బస్తాలు వచ్చాయి. వాటి కనిష్ఠ ధర రూ.10,200 గరిష్ఠ ధర రూ.10,600 మోడల్ ధర రూ.10,300 పలికింది. మొత్తం 242.250 క్వింటాళ్ల అమ్మకాలు జరిగినట్లు ఆయన తెలిపారు.

జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డికి సత్కారం



లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): గుంటూరులోని ప్రముఖ సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ ఈవీవీ యువ కళావాహిని ఈ ఏడాది ఉగాది పురస్కారాన్ని కస్టమ్స్, సెంట్రల్ ట్యాక్స్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి (ఐఆర్ఎస్)కి అందజేసింది. శుక్రవారం స్థానిక బ్రాడీపేటలోని ఒక హోటల్లో జరిగిన కార్యక్రమంలో కళావాహిని అధ్యక్షుడు కృష్ణమూర్తి, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ఏల్చూరి వెంకటేశ్వర్లు చేతుల మీదుగా కమిషనర్ నరసింహారెడ్డిని ఉగాది విశిష్ట సేవా పురస్కారం తో సత్కరించారు. ఈ సందర్భంగా సాధు నరసింహారెడ్డి మాట్లాడుతూ ఈ పురస్కారం తన బాధ్యతను మరింత పెంచిందని చెప్పారు.

మట్టితో తమ్ముళ్ల సంపద సృష్టి..!

- అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్న పచ్చ నేతలు
- దొండపాడు సమీపంలో రేయింబవళ్లు యథేచ్ఛగా తవ్వకాలు
- రియల్ ఎస్టేట్ వెంచర్లకు తరలించి జేబులు నింపుకొంటున్న వైనం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంపద సృష్టిస్తానని చంద్రబాబు చెప్పిన మాటలు పచ్చనేతలు ఆచరణలో చూపుతున్నారు. ప్రకృతి వనరులను దోచుకుంటూ వారికి వారే సంపద సృష్టించుకుంటున్నారు. ఎక్కడ చూసినా అక్రమ మట్టి తవ్వకాలు, ఇసుక తరలింపుతో నిత్యం రూ.లక్షల్లో దోచుకుంటున్నారు. దొండపాడులో ఏకంగా ఓ కొండపైనే కన్నేసి పిండి చేసేస్తున్నారు.



దొండపాడు సమీపంలో అక్రమంగా తవ్వకాలు చేపట్టిన మట్టి క్వారీ

వినుకొండ: టీడీపీ అధికారంలోకి వచ్చిన కొత్తలో వినుకొండ రూరల్ మండలం నీలగంగవరం, బొల్లాపల్లి మండలం సరికొండపాలెం, పేరూరుపాడు చెరువుతోపాటు పలు ప్రాంతాల్లో మట్టి తవ్వుకొని పచ్చ నేతలు అక్రమంగా విక్రయించారు. తాజాగా దొండపాడు సమీపంలోని చెరువు కట్ట వద్ద ఉన్న కొండనే లక్ష్యంగా చేసుకుని తవ్వకాలు ప్రారంభించారు. రాత్రి, పగలు తేడా లేకుండా అధునాతన భారీ యంత్రాలతో తవ్వుతున్నారు.

వెంచర్లకు తరలింపు

దొండపాడు సమీపంలో అక్రమంగా తవ్విన మట్టిని లోడు రూ.9 వేల చొప్పున వినుకొండ పట్టణంలో రియల్ ఎస్టేట్ వెంచర్లకు తరలించి సొమ్ము చేసుకున్నారు. యథేచ్ఛగా ఈ తంతు జరుగుతున్నప్పటికీ అధికారులు మాత్రం చూసీ చూడనట్టు వ్యవహరిస్తూ అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అంతేకాకుండా ప్రభుత్వం వేసే రోడ్లకు ఇరువైపులా మార్జిన్‌లో కూడా ఇదే మట్టిని వాడుతుండటం గమనార్హం.

రహదారులు పాడవుతున్నా...

భారీ టిప్పర్లు రాత్రింబవళ్లు లోడుతో రోడ్లపై తిరుగుతుండడంతో అవి కూడా దెబ్బతింటున్నాయి. అడిగే నాథుడే లేకపోవడంతో దొండపాడు తదితర గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఇదే ప్రాంతంలో మట్టి తవ్వకాలు జరుగుతున్నాయని ఫిర్యాదులు రావడంతో అప్పటికప్పుడు విచారణ చేపట్టిన అధికారులు నామమాత్రంగా విచారణ చేసి చేతులు దులుపుకొన్నారు. దీంతో అక్రమార్కులు మళ్లీ రెచ్చిపోతున్నారు. ఫారెస్ట్, రెవెన్యూ భూములు కలిసి ఉండడంతో ఎవరికి వారు తమ పరిధి కాదంటున్నారు. జాయింట్ ఆపరేషన్ చేయడంలో అధికారులు తాత్సారం చేస్తుండటం అక్రమార్కులకు వరంగా మారింది. తక్కువ సమయంలో వేల ట్రక్కుల మట్టి కొల్లగొడుతూ కొండను పిండి చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తవ్వకాలు నిలిపివేయాలని ప్రజలు కోరుతున్నారు.



వినుకొండలో రియల్ ఎస్టేట్ వెంచర్లకు మట్టి తరలించిన దృశ్యం

చర్యలు తీసుకుంటాం



అక్రమ మట్టి తవ్వకాలు చేపడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం. దొండపాడులో తవ్వకాల విషయం నా దృష్టికి రాలేదు. వెంటనే పరిశీలన చేసి, తగిన చర్యలు చేపడతాం. సొంత భూముల్లో మట్టి తవ్వేందుకు కూడా రెవెన్యూ శాఖ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి. బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

– సురేష్ నాయక్, తహసీల్దార్, వినుకొండ

అర్చకుల సమస్యలపై పోరాటం



మాట్లాడుతున్న జంధ్యాల వేంకట రామలింగేశ్వరశాస్త్రి

తెనాలి: అర్చకుల సమస్యలపై పోరాటానికి రాష్ట్రంలో అర్చక జేఏసీ ఏర్పాటుకు అర్చక సేవాసంఘం కీలకపాత్ర పోషించిందని ఏపీ అర్చక సేవాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు నారాయణం వేణుగోపాల్ అన్నారు. స్థానిక రైల్వేస్టేషన్ దగ్గర్లోని శ్రీపట్టాభిరామస్వామి దేవాలయంలో శుక్రవారం జరిగిన ఆంధ్రప్రదేశ్ అర్చక సేవాసంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. అర్చకులకు సంక్షేమ పథకాలు అందించేందుకు తమవంతు కృషిచేస్తామని, సనాతన హిందూ సంప్రదాయ పరిరక్షణకు సేవాసంఘం ఎప్పుడూ కట్టుబడి ఉంటుందన్నారు. సేవాసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంధ్యాల వేంకట రామలింగేశ్వరశాస్త్రి మాట్లాడుతూ అర్చకుల సంక్షేమ పథకాలను నూరుశాతానికి పునరుద్ధరించాలని దేవదాయశాఖ మంత్రి, కమిషనర్‌కు విజ్ఞప్తిచేసినట్టు తెలిపారు. అర్చకులకు ఇచ్చిన హామీలపైనా, ఆలయ సంప్రదాయాల్లో అధికారుల ప్రమేయం లేకుండా జీవోల విడుదలపై సంతోషం వ్యక్తంచేశారు. అపరిష్కృత సమస్యలపై పరిష్కారానికి కృషిచేస్తామని తెలిపారు. రాష్ట్రనాయకులు ఆమంచి రవికుమార్, బృందావనం రాధాకృష్ణమూర్తి, గొట్టిపాళ్ల కృష్ణమాచార్యులు, దీవి శేషుబాబు, పరాశరం జగన్మోహన్, యనమదల ఆంజనేయులు, పెద్దింటి ఫణిరాజేంద్రకుమార్, నందివెలుగు శేషగిరిరావు, జిల్లా నాయకులు రొంపిచర్ల శోభనాచల లక్ష్మీనృసింహాచార్యులు, చెంగోళం శేషాచార్యులు, బృందావనం గోపీచంద్, మేడూరి శ్రీనివాసమూర్తి, వడ్లమాను రమణాచార్యులు, రాష్ట్ర పదాధికారులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సీఏ పరీక్ష విధానంలో మార్పులు

- ఇకపై ఏడాదికి మూడుసార్లు సీఏ ఫైనల్ పరీక్షలు
- ఐసీఏఐ 26వ కౌన్సిల్ సమావేశంలో నిర్ణయం

గుంటూరు ఎడ్యుకేషన్: సీఏ పరీక్షల విధానంలో మార్పులు తీసుకువస్తూ ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) కేంద్ర పాలకమండలి నిర్ణయాలు వెలువరించినట్లు ఐసీఏఐ గుంటూరు శాఖ చైర్మన్ చింతా వీఎస్ఎస్ రఘునందన్, కార్యదర్శి వనిమిరెడ్డి వెంకట నరేష్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కోల్‌కత్తాలోని ఐసీఏఐ కేంద్ర కార్యాలయంలో జరిగిన 26వ కౌన్సిల్ సమావేశంలో ఐసీఏఐ అధ్యక్షుడు చరణ్‌జోత్ సింగ్ నందాతో కూడిన పాలకమండలి నూతన మార్పులను ప్రకటించినట్లు వివరించారు. సీఏ ఫైనల్ పరీక్షలకు ఏడాదిలో మూడుసార్లు రాసుకునే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు. తద్వారా ఎక్కువ సంఖ్యలో విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. ప్రపంచంలోని ఉత్తమ పద్ధతులకు అనుగుణంగా విద్యార్థులకు గొప్ప అవకాశాలను అందించేందుకు చారిత్రక నిర్ణయం తీసుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు. తాజా నిర్ణయంతో సీఏ ఫైనల్, ఇంటర్, ఫౌండేషన్ పరీక్షలు జనవరి, మే, సెప్టెంబర్ నెలల్లో జరుగుతాయని తెలిపారు. సీఏ కోర్సులకు అదనంగా పోస్ట్ క్వాలిఫికేషన్ కోర్సు ఇన్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ ఆడిట్ సైతం ప్రతి యేటా ఫిబ్రవరి, జూన్, అక్టోబర్‌లో నిర్వహిస్తారని తెలిపారు. విద్యార్థులతో సీఏలకు గణనీయమైన ప్రయోజనాలు చేకూర్చడంతో పాటు భవిష్యత్ చార్టర్డ్ అకౌంటెంట్లకు సరైన మార్గ నిర్దేశనం చేయడంలో దోహదపడుతుందని అన్నారు. ఐసీఏఐ సంస్థ సీఏ విద్యార్థులు, సీఏలు, సభ్యుల కోసం వారంలో 24 గంటల పాటు నిరంతరం పని చేస్తోందని తెలిపారు.

విద్యార్థి ఆత్మహత్యాయత్నం

కాపాడిన పోలీసులు



యువకుడిని కాపాడి తీసుకువస్తున్న కానిస్టేబుల్ సాగర్‌బాబు

మంగళగిరి: రైలు కింద పడి ఆత్మహత్య చేసుకునేందుకు యత్నిస్తున్న విద్యార్థిని అటుగా వెళ్తున్న పోలీసులు కాపాడిన ఘటన శుక్రవారం అర్ధరాతి జరిగింది. రూరల్ సీఐ వై. శ్రీనివాసరావు కథనం మేరకు శుక్రవారం అర్ధరాత్రి మంగళగిరి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుళ్లు శేఖర్‌బాబు, సాగర్‌బాబు విధులు ముగించుకుని తిరిగి ఇంటికి వెళ్లే సమయంలో అగవర్తపాడు, గడ్డిపాడు రైల్వే గేటు వద్ద కొంత దూరంలో ఓ యువకుడు రైలు కింద పడి ఆత్మహత్యాయత్నానికి సిద్ధపడడం గమనించారు. వెంటనే అప్రమత్తమైన కానిస్టేబుళ్లు యువకుడు వద్దకు వెళ్లి వివరాలు సేకరించారు. తాను ఓ ప్రైవేటు కళాశాలలో చదువుతున్నానని, తోటి విద్యార్థులు అవమానించేలా మాట్లాడడంతో ఆత్మహత్య చేసుకుందామని వచ్చానని వివరించాడు. తనది చీరాలని, పేరు ఫణిదపు వెంకట రుషి అని చెప్పాడు. విద్యార్థికి తెలిసిన మరో యువకుడికి సమాచారం ఇచ్చి ఇద్దరినీ స్టేషన్‌కు తీసుకొచ్చి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. కౌన్సెలింగ్ ఇచ్చారు. తల్లిదండ్రులు వచ్చి విద్యార్థిని తీసుకెళ్లారు. తమ కుమారుడిని కాపాడిన పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.



అరుణాచలం మాణిక్యవేల్ చిత్రపటం వద్ద నివాళులర్పింస్తున్న మోదుగుల వేణుగోపాలరెడ్డి



అరుణాచలం మాణిక్యవేల్ చిత్రపటం వద్ద నివాళులర్పించిన నూరిఫాతిమా

మాణిక్యవేల్‌కు పలువురు నివాళి

నగరంపాలెం: స్థానిక రింగ్‌రోడ్డులోని శ్రీకన్వెన్షన్ హాల్‌లో ట్రిపుల్ ఎక్స్ కంపెనీ అధినేత దివంగత డాక్టర్ అరుణాచలం మాణిక్యవేల్(అన్నాజీ) దశదినకర్మ శుక్రవారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ గుంటూరు, పల్నాడు జిల్లాల పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు మోదుగుల వేణుగోపాలరెడ్డి, పార్టీనగర అధ్యక్షురాలు షేక్ నూరిఫాతిమా, క్రెడాయి రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ల శివారెడ్డి, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, టీడీపీ నాయకులు కొవెలమూడి రవీంద్ర(నాని), జబ్బర్దస్ ఫేం, పలువురు ప్రముఖులు, రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు హాజరై, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అరుణాచలం మాణిక్యవేల్ కుమారుడు పర్విన్‌రాజ్ మాణిక్యవేల్, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు

రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్



మాట్లాడుతున్న విజయ్‌కుమార్

గుంటూరు రూరల్: ప్రకృతి సేద్యం మేలు చేస్తుదని రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి.విజయ్‌కుమార్ తెలిపారు. మూడు రోజులుగా నగరంలోని ప్రైవేట్ హోటల్లో ప్రకృతి వ్యవసాయంపై నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రకృతి సేద్యాన్ని విస్తృతం చేయాలని సూచించారు. ప్రస్తుతం ప్రస్తుతం అనుసరిస్తున్న రసాయన వ్యవసాయ విధానాలపై ఆరా తీశారు. రైతు సాధికార సంస్థ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ వరప్రసాద్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంపై రాష్ట్రంలో చేసిన వివిధ పరిశోధనల ఫలితాల గురించి వివరించారు. సీనియర్ థిమాటిక్ లీడ్ డాక్టర్ జాకీర్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో పంటల నిరోధకత (క్రాప్ రెసిలియన్స్)పై అధికారులకు అవగాహన కల్పించారు. శిక్షణలో రైతు సాధికార సంస్థ థిమాటిక్ లీడ్ సురేష్, సీనియర్ రిసోర్స్ పర్సన్‌లు రామచంద్రం, రాజేశ్వర్, రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి వచ్చిన వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్లు, అసిస్టెంట్ డైరెక్టర్లు, అగ్రికల్చర్ ఆఫీసర్లు, సెర్ప్ డీపీఎం, ఏపీఎంలు పాల్గొన్నారు.

పీహెచ్‌సీని సందర్శించిన కేంద్ర బృందం

పెదకూరపాడు: మండలంలోని 75 త్యాళ్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం కేంద్ర బృందం సందర్శించింది. డాక్టర్ ఏఎస్ పరిమళ జగన్, డాక్టర్ భద్రకాంత్ శర్మల ఆధ్వర్యంలో సభ్యులు ఎన్‌క్యూఏఎస్ (జాతీయ నాణ్యత హామీ ప్రమాణాలు)లో భాగంగా వైద్యశాలలో సేవలను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం వైద్య సిబ్బందితో మాట్లాడుతూ సేవలపై దృష్టి పెట్టాలన్నారు.

పాతచీరల్లో ఆభరణాలు పెట్టి.. ఆనక అమ్మేసి

- లబోదిబోమన్న వృద్ధురాలు
- రికవరీ చేసిన పోలీసులు



వెంకటసుబ్బమ్మకు ఆభరణాలను అప్పగిస్తున్న సాంబశివరావు

కొల్లిపర: పాత చీరల్లో ఆభరణాలను పెట్టిన సంగతి మర్చిపోయి వాటిని అమ్మేసిన వృద్ధురాలు ఆ తర్వాత విషయం గుర్తుకు వచ్చి పోలీసులను ఆశ్రయించింది. దీంతో పోలీసులు పాత చీరలు కొన్న వ్యక్తిని గుర్తించి ఆభరణాలను వృద్ధురాలికి తిరిగి అప్పగించారు. పోలీసుల కథనం ప్రకారం.. మున్నంగికి చెందిన 74 ఏళ్ల కుర్రే వెంకటసుబ్బమ్మ తన ఇంట్లోని నాలుగు పాత చీరలను గురువారం అమ్మేసింది. వాటిలో రెండు బంగారు గాజులు, ఒక గొలుసు (మొత్తం 56 గ్రాములు) ఉన్న సంగతి మర్చిపోయింది. ఆ తర్వాత ఆభరణాల విషయం గుర్తుకు రావడంతో శుక్రవారం కొల్లిపర పోలీసులను ఆశ్రయించింది. ఎస్ఐ పి.కోటేశ్వరరావు నేతృత్వంలో సిబ్బంది బృందంగా ఏర్పడి కెమెరాల ఫుటేజీలను పరిశీలించి, చీరలను కొనుగోలు చేసింది తెనాలి నందులపేటకు చెందిన పాత చీరల వ్యాపారం చేసే తాడిశెట్టి సాంబశివరావుగా గుర్తించారు. అతన్ని అదుపులోకి తీసుకునేందుకు వెళ్లగా అప్పటికే అతను ఆభరణాలను గుర్తించి పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చేందుకు బయలుదేరాడు. ఆయన్ను కొల్లిపర తీసుకువెళ్లి ఆభరణాలను అతనిచేతుల మీదుగానే వెంకటసుబ్బమ్మకు అందజేశారు.

సంగీత 'సరస్వతీ' నమస్తుభ్యం

అలరించిన సరస్వతి రాజ గోపాలన్ వీణావాదన




జయ భాస్కరరావు, హనుమంతరావు వాద్య సహకారంతో వీణా వాదన చేస్తున్న సరస్వతి రాజ గోపాలన్

గుంటూరు ఎడ్యుకేషన్: సంగీతంతో మానసిక ప్రశాంతత సిద్ధిస్తుందని, రోగాల నుంచి ఉపశమనం లభిస్తుందని శాస్త్రీయంగా నిరూపితమైనట్లు ప్రముఖ వీణా విద్వాంసురాలు, కలైమామణి విదుషి సరస్వతి రాజగోపాలన్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ బంగ్లా రోడ్డులోని భారతీయ విద్యాభవన్‌లో నెలకొల్పిన భవన్స్ అకాడమీ ఆఫ్ కల్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్‌ను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులను, ఉపాధ్యాయులను ఉద్దేశించిన మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలోని వివిధ వర్గాల ప్రజలు యాంత్రిక జీవనానికి అలవాటు పడి మానసిక ప్రశాంతతకు దూరమవుతున్నారని, ఆహ్లాదకరమైన సంగీత, సాహిత్య, నృత్య కళలను ఆస్వాదించలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భవన్స్ అకాడమీ ద్వారా గుంటూరు నగరంలోని విద్యార్థులకు చిన్న వయసు నుంచే మన ప్రాచీన సంస్కృతి, సంగీత, నృత్య కళలను నేర్చుకునే అవకాశాన్ని కల్పించడం అదృష్టమని అన్నారు. భారతీయ విద్యాభవన్ కార్యదర్శి పి.రామచంద్ర రాజు మాట్లాడుతూ బాల, బాలికలు చదువు, ఆటలతోపాటు భారతీయ సంగీత, సాహిత్య, లలిత కళలు నేర్చుకుని ఉత్తమ పౌరులుగానే కాక మంచి కళాకారులుగా రాణించి తల్లిదండ్రులతోపాటు సమాజం గర్వించేస్థాయికి ఎదుగుతారని అన్నారు. విద్యార్థులను కళాకారులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా భవన్స్ అకాడమీ ఆఫ్ ఆర్ట్స్ అండ్ ఫైన్ ఆర్ట్స్‌ను స్థాపించినట్లు తెలిపారు. ఈసందర్భంగా సరస్వతి రాజగోపాల్ చేసిన వీణా వాదన ఆహూతులను అలరింపజేసింది. ప్రముఖ మృదంగ విద్వాంసులు జయ భాస్కర రావు, ఆల్ ఇండియా రేడియో హయ్యర్ గ్రేడ్ అవార్డు గ్రహీత, ప్రఖ్యాత ఘట విద్వాంసులు సరస్వతుల హనుమంతరావు మృదంగ, ఘట జుగల్బందీ కార్యక్రమం వీనుల విందుగా సాగింది. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ హేమాంబ, హెచ్ఎం కృష్ణఉషశ్రీ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జాతీయ జట్టుకు శిక్షణ పూర్తి

జె.పంగులూరు: ఈ నెల 31 నుంచి ఏప్రిల్ 4 వరకు ఒడిశా రాష్ట్రంలోని పూరి పట్టణంలో 57వ జాతీయ స్థాయి స్త్రీ, పురుషుల పోటీలు జరగనుంది. ఈ పోటీలలో పాల్గొనే రాష్ట్ర జట్టుకు 10 రోజుల నుంచి స్థానిక మాగుంట సుబ్బరామిరెడ్డి, బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాలలోని క్రీడా ప్రాంగణంలో రాష్ట్ర ఖోఖో అసోసియేషన్, పంగులూరు గ్రామస్తుల సహకారంతో, ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీ ఆధ్వర్యంలో జట్టుకు శిక్షణ జరిగింది. శుక్రవారం రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి మేకల సీతారామిరెడ్డి అధ్యక్షతన జరిగిన శిక్షణ ముగింపు కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా తహసీల్దార్ సింగరావు హాజరయ్యారు. కీరడాకారులను అభినందించారు.



తెలుగువారి తొలి పండగ వచ్చేస్తోంది. నూతనోత్సాహంతో ఉగాదిని ఆహ్వానించడానికి సిద్ధమవుతున్న వేళ... కొత్త తరానికి పండగల అర్థం తెలుస్తోందా? అంటే... 'పెద్దవాళ్లు చెబితేనే తెలుస్తుంది' అంటున్నారు ప్రముఖ రచయితలు రామజోగయ్య శాస్త్రి, అనంత శ్రీరామ్. ఉగాది ప్రత్యేకంగా ఇంకా ఈ ఇద్దరూ చెప్పిన విశేషాలు తెలుసుకుందాం.



కొత్త తరానికి చెబుదాం

- రామజోగయ్య శాస్త్రి

పండగలు జరుపుకోవడం ఎవరూ మానేయలేదు. పిండివంటలు చేసుకోవడానికైనా పండగలు చేసుకుంటున్నాం. పండగ పూట తల స్నానం చేసి, ఉగాది పచ్చడి తిన్న తర్వాతే మిగతా పనులు చేయాలని పిల్లలకు పెద్దలు చెప్పాలి. ఎప్పటికప్పుడు కొత్త తరానికి పాత తరంవాళ్లు చెబుతుండాలి. ఎందుకంటే పండగలన్నీ ముందు తరంవాళ్లు చేసుకుంటూ వచ్చారు కాబట్టి చెప్పడం వారి బాధ్యత. కొత్త తరాన్ని పాజిటివ్‌గా స్వాగతించాలి. వారూ వెల్‌కమింగ్‌గానే ఉంటారు. మన తానులో పెరిగిన ముక్కలు వేరేలా ఎలా ఉంటారు? కొత్త తరానికి పద్ధతులన్నీ కొత్తే. పోనీ ఇవాళ్టి పాత తరం అనుకున్నవారికి ఎవరు చెప్పారు? వారి ముందు తరంవారు చెబితేనే కదా వీరికి తెలిసింది. ఇది రిలే పందెంలాంటిది. ఒక తరానికి ఒక తరానికి సక్రమంగా విషయాలను అందజేయాల్సిన బాధ్యత ముందు తరానికి ఉంటుంది.

యువతని నిందించడం సరికాదు: ప్రపంచాన్ని రెండు రకాలుగా చూడొచ్చు. మంచి కోణంలో... దుర్గార్మపు కోణంలో... ఎప్పుడూ మొదటి కోణంలో చూస్తే మంచిది. అది కాదనుకుని యువత పెడదారి పట్టిందని, ఏదేదో జరిగిపోతోందని యువతరాన్ని నిందించడం సరికాదు. ఏదీ వక్రీకరించిన కోణంలో చూడొద్దు. ఫారిన్ కల్చర్ అంటున్నాం... విదేశాలు వెళ్లి చూస్తే ఇక్కడికన్నా ఎక్కువ అక్కడ పండగలు బాగా జరుపుకుంటున్నారు. అన్నమాచార్యుల కీర్తనలు కూడా పాడుతున్నారు. ఇక్కడితో పోల్చితే అమెరికా ఫాస్ట్ ఫార్వార్డ్ అనుకోవాలి కదా. కానీ అక్కడ మన సంప్రదాయాలు బతికే ఉన్నాయి. ఇక ఎప్పటికీ ఇండియా రామని తెలిసిన కుటుంబాలు కూడా తమ పిల్లలకు తెలుగు నేర్పిస్తున్నారు... మన సంప్రదాయాల గురించి చెబుతున్నారు. పిల్లలూ నేర్చుకుంటున్నారు.

యువతరం బాధ్యతగా ఉంటోంది: సారవంతమైన నేల అది (యువతరాన్ని ఉద్దేశించి). బీజం వేయడం అనేది మన చేతుల్లో ఉంది. ముందు తరం బాధ్యతగా ఉండి, తర్వాతి తరానికి దగ్గరుండి అన్నీ నేర్పించి, అన్నీ ఆచరించేలా చేయాలి. వీళ్ల పాటిస్తూ వాళ్ల పాటించేలా చేయాలి. పొద్దున్నే వీళ్ల స్నానం చేయకుండా... పిల్లలను స్నానం చేసి, పూజలు చేయమంటే ఎందుకు చేస్తారు? నువ్వు చేయడంలేదు కదా? అంటారు. ఒకవేళ మాటల రూపంలో చెప్పకపోయినా... ముందు తరం ఆచారాలు పాటిస్తుంటే వీళ్ల చూసి, నేర్చుకుంటారు... అనుసరించడానికి ఇష్టపడతారు. బోధించే విధానం సక్రమంగా ఉండాలి. ఫైనల్‌గా చెప్పేదేంటంటే... మనం అనుకున్నంతగా యువతరం ఏమీ దిగజారిపోలేదు. చెప్పాలంటే మనకన్నా ఇంకా బాధ్యతగా ఉంటూ, పాతా కొత్తా బ్యాలెన్స్ చేసుకుంటూ వెళుతున్నారు. ఈ కాలపు పిల్లలు ఇంటికీ, బయటికీ పర్ఫెక్ట్ బ్యాలెన్స్ తెలిసిన వాళ్లు. వాళ్లలో ఏదైనా లోపం ఉందీ అంటే... చెప్పేవాళ్లదే కానీ వాళ్లది కాదు. సో... ఏ పండగని ఎందుకు జరుపుకోవాలో విడమర్చి యువతరానికి చెప్పాల్సిన బాధ్యత ముందు తరానిదే. సంవత్సరాది ఎందుకు జరుపుకుంటున్నాం? ఉగాది పచ్చడి విశిష్టత వంటివి చెప్పి, పండగ అర్థం తెలియజేయాలి.



పండగ 'రుచి' చూపాలి

- అనంత శ్రీరామ్

పండగలు జరుపుకునే తీరు మారింది. పెళ్లిళ్లల్లో ఎప్పుడైతే మనకు లేని రిసెప్షన్ అని మొదలుపెట్టామో అలానే పండగలు జరుపుకునే తీరులోనూ మార్పు వచ్చింది. ఉగాది గురించి చెప్పాలంటే... మా ఊరులో ఐదు రోజులు ఉగాది జాతర జరుగుతుంది. మాది వెస్ట్ గోదావరి, యలమంచిలి మండలం, దొడ్డిపట్ల గ్రామం. జాతర సందర్భంగా ఊరేగింపులు అవీ చేస్తుంటారు. ఇప్పుడూ జరుగుతున్నాయి. కానీ ఇప్పుడు జాతరలో భాగంగా మేజిక్ షోస్ అంటూ వెస్టన్ కల్చర్ మిక్స్ అయిపోయింది. ఉగాది అంటే కవి సమ్మేళనాలు విరివిగా జరిగేవి. ఇప్పుడలా లేదు. ఎవరైనా విద్యావంతులు లేదా శాంతి సమాఖ్యలు వాళ్లు ఏదో టౌన్ హాలులో కవి సమ్మేళనాలు ఏర్పాటు చేసినా ఓ ఇరవై ముప్పైమంది ఉంటున్నారు... అంతే.

ఉగాది ప్రత్యేకం అమ్మవారి జాతర: ఇక మా ఊరి ఉగాది గురించి చెప్పాలంటే... మాణిక్యాలమ్మ మా గ్రామ దేవత. ఉగాది సమయంలో మాకు ఆ అమ్మవారి జాతర ఉంటుంది. ఉగాది ప్రత్యేకం అంటే ఆ జాతరే. ఐదు రోజులు ఘనంగా చేస్తారు. ఐదో రోజు అయితే అమ్మవారిని బాగా అలంకరించి, ఊరేగించి, తెప్పోత్సవం చేస్తారు. నేను ప్రతి ఏడాది దాదాపు మిస్ కాకుండా వెళతాను. ఈసారి కుదరదు.

ఆరు రుచులను సమానంగా ఆస్వాదించాలి: ఉగాది పచ్చడిలోని షడ్రుచుల గురించి చెప్పాలంటే... నేను 'ఒక్కడున్నాడు' సినిమాలో 'ఇవ్వాళ నా పిలుపు... ఇవ్వాలి నీకు గెలుపు... సంవత్సరం వరకు ఓ లోకమా...' అని పాట రాశాను. అది పల్లవి. పాట మొదటి చరణంలో రుచుల గురించి రాశాను. 'కొంచెం తీపి... కొంచెం పులుపు పంచే ఆ ఉల్లాసమూ... కొంచెం ఉప్పు... కొంచెం కారం పెంచే ఆ ఆవేశమూ... చేదూ వగరూ చేసే మేలూ... సమానంగా ఆస్వాదించమని ఇవ్వాళ నా పిలుపు' అని రాశాను. ఆరు విభిన్నమైన రుచులను సమానంగా ఆస్వాదిస్తేనే జీవితాన్ని పూర్తిగా అర్థం చేసుకోగలమని చెప్పడమే ఆ పాట ఉద్దేశం. అంటే... జీవితంలో ఎదురయ్యే పరిస్థితులన్నింటినీ సమానంగా స్వీకరించగలగాలి.

ఆ బాధ్యత పెద్దవాళ్లదే: ఇక నేటి తరం గురించి చెప్పాలంటే... ఇప్పుడు కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలతో హాలోవెన్ అంటూ రకరకాల వేషాలు వేయిస్తున్నారు. వేలంటైన్స్ డే అనీ ఇంకా వేరే ఎక్కడెక్కడ నుంచో తెచ్చిపెట్టుకున్న పండగలను జరుపుతున్నారు. అయితే పిల్లలకు మన పండగల గురించి చెప్పాలి. వేరే సంబరాలు ఎలా ఉన్నా కూడా మన పండగలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి. ఇలా పాత తరం ఆచరిస్తే కొత్త తరానికి అర్థం అవుతుంది. వాళ్లు మన సంస్కృతీ సంప్రదాయాలను ముందుకు తీసుకెళతారు. మా గ్రామంలో ఉగాది అంటే... ఇంట్లో పిల్లలకు వేప పూత, మామిడికాయలు, చెరుకు గడలు తెమ్మని టాస్కులు ఇచ్చేవారు. అవి తెచ్చే క్రమంలో మాకు పండగలు అర్థమయ్యేవి. అలా మా ముందు తరంవాళ్లు మాకు నేర్పించారు. కొత్త తరానికి మనం అలా నేర్పిస్తే వాళ్లు పాటిస్తారు. ముందు తరాలకు సంస్కృతీ సంప్రదాయాలను నేర్పించే బాధ్యత పెద్దవాళ్లదే.

- డి.జి. భవాని



6 రుచులు ఆరోగ్య లాభాలు

ఉగాది పచ్చడిని సేవించే ఆచారం శాలివాహన శకారంభం నుంచి మొదలైనట్లుగా చరిత్రకారులు చెబుతారు. సంప్రదాయ పద్ధతిలో ఉగాది పచ్చడిని కొత్త మట్టికుండలో తయారు చేస్తారు. ఉగాది పచ్చడిలో వేపపూత, మామిడి పిందెలు, చింతపండు, ఉప్పు, మిరియాల పొడి, బెల్లం, అరటిపండు ముక్కలు ఉపయోగిస్తారు. వీటి వల్ల ఉగాది పచ్చడి ఆరురుచుల సమ్మేళనంగా తయారవుతుంది. ఉగాది పచ్చడిలో ఉపయోగించే పదార్థాలు, వాటి ఆరోగ్య ప్రయోజనాల గురించి తెలుసుకుందాం....

బెల్లం, అరటి పండ్లు- తీపి
బెల్లం తీపిగా ఉంటుంది. ఎండ వేడిమి వల్ల కలిగే అలసటను పోగొట్టి, తక్షణ శక్తినిస్తుంది. బెల్లాన్ని అరటిపండుతో కలిపి తీసుకోవడం శ్రేష్ఠమని ఆయుర్వేదం చెబుతోంది. అరటిపండులో పొటాషియం పుష్కలంగా ఉంటుంది. అధిక రక్తపోటు, మూత్రపిండాల సమస్యలను అరటి పండు నిరోధిస్తుంది.

చింతపండు- పులుపు
ఉగాది పచ్చడి తయారీకి పాత చింతపండు ఉపయోగించడం మంచిది. పాత చింతపండు ఉష్ణాన్ని, వాత దోషాలను తగ్గిస్తుంది. బడలికను పోగొడుతుంది. జఠరశక్తిని పెంచుతుంది. మూత్రవిసర్జన సజావుగా సాగేందుకు దోహదపడుతుంది. వేసవిలో చింతపండు రసం తీసుకోవడం వల్ల ఉష్ణదోషాలు తగ్గుతాయని ఆయుర్వేదం చెబుతోంది.

ఉప్పు
రుచులకు రారాజులాంటిది ఉప్పు. ఉప్పులేని పప్పులు, కూరలు, పచ్చళ్లు రుచించవు. ఆహారంలో అనునిత్యం ఉపయోగించే ఉప్పు త్రిదోషాలను- అంటే, వాత పిత్త కఫ దోషాలు మూడింటినీ పోగొడుతుందని ఆయుర్వేదం చెబుతోంది. అయితే, ఉప్పును మోతాదులోనే వాడాలి.

మామిడి పిందెలు- వగరు
మామిడి కాయలు ముదిరితే పులుపుగా ఉంటాయి గాని, పిందెలు వగరుగా ఉంటాయి. మామిడి పిందెల వగరుదనం లేకుంటే, ఉగాది పచ్చడికి పరిపూర్ణత రాదు. మామిడి పిందెలలో విటమిన్-సి పుష్కలంగా ఉంటుంది. మామిడి పిందెలు రోగనిరోధక శక్తిని పెంచుతాయి. శరీరంలోని త్రిదోషాలను హరించి, శక్తిని కలిగిస్తాయని ఆయుర్వేదం చెబుతోంది.

వేపపూలు- చేదు
వసంతారంభంలో వేపపూలను తినే ఆచారం దాదాపు అన్ని ప్రాంతాల్లోనూ ఉంది. దీనిని 'నింబకుసుమ భక్షణం' అంటారు. షడ్రసోపేతమైన ఉగాది పచ్చడిలో వేపపూలను ఉపయోగించడం మన తెలుగువాళ్లకే చెల్లింది. వేపపూలు కఫదోషాన్ని, క్రిమిదోషాలను పోగొడతాయి. జీర్ణకోశ సమస్యలను నివారిస్తాయి.

మిరియాల పొడి-కారం
మిరియాలను నేరుగాను, పొడిగాను వంటకాల్లో తరచుగా వినియోగిస్తూనే ఉంటాం. మిరియాలు రుచికి కారంగా ఉన్నా, శరీరానికి చాలా మేలు చేస్తాయి. మిరియాలు కఫదోషాన్ని, విష దోషాలను హరిస్తాయి. చర్మవ్యాధులను అరికట్టడమే కాకుండా, జీర్ణశక్తిని, శరీరంలోని జీవక్రియలను పెంచుతాయి. అందుకే సంప్రదాయ ఆయుర్వేద ఔషధాల్లో మిరియాలను విరివిగా ఉపయోగిస్తారు.



ఉగాది పచ్చడి

కావలసినవి: కొత్త బెల్లం – 100 గ్రాములు, పచ్చి మామిడి – ఒకటి (మీడియం సైజు), వేప పువ్వు – ఒక టేబుల్ స్పూన్, పచ్చి మిర్చి – రెండు (తురమాలి), ఉప్పు – చిటికెడు, చింతపండు – పెద్ద నిమ్మకాయంత (కొత్త చింతకాయల నుంచి సేకరించినది).

తయారీ: ● బెల్లాన్ని తురిమి, అందులో కొద్దిగా నీటిని చిలకరించి పక్కన ఉంచాలి. ● వేప పువ్వు కాడలు లేకుండా వలిచి పువ్వు రెక్కలను సేకరించి పక్కన ఉంచాలి. ● మామిడి కాయ మొదలు (సొన కారే భాగం) తీసేయాలి. కాయను నిలువుగా కోసి లోపలి గింజను కూడా తీసేయాలి. ఇప్పుడు మామిడి కాయను తొక్కతోపాటు సన్నగా ముక్కలు తరగాలి లేదా తురిమి బెల్లం నీటిలో వేయాలి. ● చింతపండు గుజ్జును చిక్కగా రసం తీసి పై మిశ్రమంలో కలపాలి. అందులో పచ్చిమిర్చి తురుము, ఉప్పు, వేప పూత వేసి కలపాలి. ఈ మిశ్రమం చిక్కగా ఉంటుంది. మరింత రుచి కోసం చెరకు ముక్కలు, మిగుల మగ్గిన అరటి పండు గుజ్జు కలుపుకోవచ్చు.



పూర్ణాలు

కావలసినవి: పచ్చిశనగ పప్పు – అర కేజీ, బెల్లం – అర కేజీ, యాలక్కాయలు – పది, బియ్యం – రెండు కప్పులు, పొట్టుతీసిన మినప గుళ్లు – కప్పు, ఉప్పు – రుచికి సరిపడా, ఆయిల్ – డీప్ ఫ్రైకి సరిపడా.

తయారీ: ● ముందుగా మినప పప్పు, బియ్యాన్ని శుభ్రంగా కడిగి ఆరుగంటల పాటు నానబెట్టుకోవాలి. శనగ పప్పుని కూడా కడిగి గంట పాటు నానబెట్టాలి ● నానిన బియ్యం మినప పప్పులని మెత్తగా రుబ్బి పక్కన పెట్టుకోవాలి ● నానిన శనగ పప్పుని కుకర్‌లో వేసి రెండు గ్లాసులు నీళ్లపోసి మూడు విజిల్స్ రానివ్వాలి ● ఉడికిన శనగ పప్పులో బెల్లం వేసి మెత్తగా గరిటతో తిప్పుతూ దగ్గర పడేంత వరకు ఉడికించి, యాలుక్కాయల పొడి వేసి తిప్పి దించేయాలి ● శనగపప్పు మిశ్రమం చల్లారాక, ఉండలుగా చుట్టుకోవాలి ● బియ్యం, మినపగుళ్ల రుబ్బులో కొద్దిగా ఉప్పు వేసి తిప్పాలి. ఇప్పుడు శనగ పప్పు ఉండలను ఈ పిండిలో ముంచి ఆయిల్‌లో డీప్ ఫ్రై చేయాలి ● మీడియం మంట మీద గోల్డెన్ బ్రౌన్ రంగులోకి మారేంత వరకు వేయిస్తే తియ్యని పూర్ణాలు రెడీ.



పరమాన్నం

కావలసినవి: బియ్యం – అర కప్పు, పాలు – కప్పు, బెల్లం తురుము – ముప్పావు కప్పు, నెయ్యి – ముప్పావు కప్పు, జీడి పప్పు పలుకులు – రెండు టేబుల్ స్పూన్లు, యాలకుల పొడి – అర టీస్పూను, పచ్చకర్పూరం – చిటికెడు.

తయారీ: ● ముందుగా బియ్యాన్ని కడిగి పదిహేను నిమిషాల పాటు నానబెట్టుకోవాలి ● ఒక గిన్నెలో పాలుపోసి కాయాలి. కాగిన పాలల్లో నానబెట్టిన బియ్యం వేసి తిప్పుతూ ఉడికించాలి. అన్నం మెత్తగా ఉడికాక దించి చల్లారనివ్వాలి ● స్టవ్ మీద మరో బాణలి పెట్టుకుని నెయ్యి వేయాలి. నెయ్యి వేడెక్కిన తరువాత జీడి పప్పు పలుకులు వేసి గోల్డ్ కలర్‌లోకి మారేంత వరకు వేయించాలి ● స్టవ్ మీద మరో పాత్ర పెట్టి బెల్లం తురుము వేయాలి. దీనిలో పావుకప్పు నీళ్లపోసి సిరప్‌లా మారేవరకు ఉడికించి, చల్లారనివ్వాలి ● బెల్లం సిరప్‌లోనే యాలకుల డి, పచ్చ కర్పూరం వేసి తిప్పాలి ● బెల్లం సిరప్ చల్లారక అన్నంలో వేసి బాగా కలపాలి, దీనిలో మిగిలిన నెయ్యి, జీడిపప్పుతో గార్నిష్ చేస్తే పరమాన్నం రెడీ.



మామిడి కాయ పులిహోర

కావలసినవి: బియ్యం – కప్పు, పచ్చిమామిడి కాయ – మీడియం సైజుది ఒకటి, పచ్చికొబ్బరి తురుము – అర కప్పు, ఆవాలు – టీస్పూను, మినప పప్పు – టీస్పూను, పచ్చి శనగ పప్పు – టీ స్పూను, వేరుశనగ గుళ్ళు – రెండు టేబుల్ స్పూన్లు, కరివేపాకు – మూడు రెమ్మలు, పచ్చిమిర్చి తరుగు – రెండు టేబుల్ స్పూన్లు, ఎండు మిర్చి – నాలుగు, మెంతులు – పావు టీస్పూను, ఆయిల్ – నాలుగు టేబుల్ స్పూన్లు, పసుపు – పావు టీస్పూను, చింతపండు ఉసిరికాయంత, బెల్లం తురుము – రెండు టీస్పూన్లు, ఉప్పు – రుచికి సరిపడా.

తయారీ: ● ముందుగా బియ్యాన్ని శుభ్రంగా కడిగి అన్నం పొడి పొడిగా వచ్చేలా వండి ఆరబెట్టుకోవాలి ● మామిడి కాయ తొక్క తీసి ముక్కలుగా తరగాలి ● ఎండు మిర్చి, మెంతులు, అరటీస్పూను ఆవాలను దోరగా వేయించుకుని పొడిచేయాలి. ఈ పొడిలో పచ్చికొబ్బరి, మామిడికాయ ముక్కలు, చింతపండు, బెల్లం వేసి మెత్తగా గ్రైండ్ చేసి పక్కనపెట్టుకోవాలి ● స్టవ్ మీద బాణలి పెట్టి ఆయిల్ వేయాలి. ఆయిల్ వేడెక్కిన తరువాత ఆవాలు వేయాలి. చిటపటలాడాక మినప పప్పు, శనగ పప్పు, పచ్చిమిర్చి తరుగు, కరివేపాకు వేయాలి ● ఇవన్నీ వేగాక వేరుశనగ గుళ్ళు వేసి వేయించాలి. ఇవి వేగాక పసుపు, గ్రైండ్ చేసిన మామిడికాయ మిశ్రమం వేసి ఐదు నిమిషాలు వేయించాలి ● తరువాత రుచికి సరిపడా ఉప్పు వేసి, ఆరబెట్టిన అన్నాన్ని వేసి కలిపితే మామిడికాయ పులిహోర రెడీ.

వృథాని జీరో చేద్దాం

యునైటెడ్ నేషన్స్ జనరల్ అసెంబ్లీ... మార్చి నెల 30వ తేదీని జీరో వేస్ట్ డే గా గుర్తిస్తూ 2022, డిసెంబర్ 14వ తేదీన ఒక తీర్మానాన్ని చేసింది. యునైటెడ్ నేషన్స్ ఆర్గనైజేషన్ అప్పటి నుంచి మార్చి నెల 30వ తేదీని 'ఇంటర్నేషనల్ డే ఆఫ్ జీరో వేస్ట్'గా గుర్తిస్తూ ప్రపంచాన్ని చైతన్యవంతం చేస్తోంది. ఈ ఏడాది ఫ్యాషన్ అండ్ టెక్స్‌టైల్ రంగాల వృథా మీద దృష్టి పెట్టింది.

పర్యావరణాన్ని కలుషితం చేస్తున్న వాయు, నీటి కాలుష్యాలతోపాటు వస్త్రాల అవశేషాలు కూడా ప్రధానమైనవి. క్లాత్‌తో డ్రెస్ కుట్టిన తర్వాత వచ్చే మిగులు నదులు, కాలువల్లోకి చేరి నీటిలో, నీటి అడుగుల మట్టిలో నిలిచిపోతోంది. కొంతకాలానికి ఆ వస్త్రానికి అద్దిన రసాయన రంగులు నేలలో, నీటిలో ఇంకుతాయి. ఇలా వేస్ట్ క్లాత్ కారణంగా కెమికల్ పొల్యూషన్ నీటిని, మట్టిని కూడా కలుషితం చేస్తోంది. ప్రపంచవ్యాప్తంగా దుస్తుల తయారీ విపరీతంగా పెరిగిపోయింది. 2000 సంవత్సరంలో ఉత్పత్తి 2015నాటికి రెండింతలైంది. ఏడాదికి 92 మిలియన్ టన్నుల టెక్స్‌టైల్ వేస్ట్ లెక్క తేలుతోంది. ఇది కాలువలు, నదుల్లోకి వెళ్తోంది. దీనిని అరికట్టడం కోసమే యూఎన్ఓ (యునైటెడ్ నేషన్స్ ఆర్గనైజేషన్) ఈ ఏడాది ఫ్యాషన్ ఇండస్ట్రీ వేస్ట్ మీద దృష్టి పెట్టింది. ఫ్యాషన్, టెక్స్‌టైల్ రంగాలను జీరో వేస్ట్ దిశగా నడిపించడానికి మార్గాలను అన్వేషించాలంటోంది యూఎన్ఓ. హైదరాబాద్‌లో ఫ్యాషన్ ఇండస్ట్రీ నిర్వహిస్తున్న సుదీప కందుల ట్రిపుల్ ఆర్ (రీ యూజ్, రీ సైకిల్, రీ పెయిర్) అనే యూఎన్ఓ థీమ్‌ను రెండు దశాబ్దాలుగా అమలు చేస్తున్నారు.



మనసుంటే మార్గం ఉంటుంది!

సుదీప కందుల... ఆలన బొటీక్ పేరుతో చిన్న పిల్లల దుస్తుల డిజైనింగ ప్రారంభించి మూడు దశాబ్దాలవుతోంది. ఫ్యాషన్ ఇండస్ట్రీలో బొటీక్ కల్చర్ మొదలైన తొలినాళ్ల నుంచి బొటీక్ నడుపుతున్నారామె. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని భావించే సుదీప, ఆమె ఉద్యోగులు పాలిథిన్ కవర్ల వినియోగాన్ని తగ్గించడానికి మార్కెట్‌కెళ్లేటప్పుడు క్లాత్ బ్యాగ్‌ను వెంట తీసుకువెళ్తారు. బొటీక్‌లో ఉత్పన్నమయ్యే వేస్ట్ క్లాత్‌ను పునర్వినియోగంలోకి తీసుకురావడానికి అనేక మార్గాలనెంచుకున్నారు సుదీప. చిన్న ముక్కలతో నవజాత శిశువులకు, ఏడాది లోపు పిల్లలు ధరించడానికి వీలుగా కుట్టించి ఆర్ఫనేజ్‌కు ఇచ్చారు. అలా కుదరని వాటిని నగరంలోని ఒక ఎన్‌జీవోకి ఇస్తుంటారు. ఆ ఎన్‌జీవోలో అల్పాదాయ వర్గాల మహిళలకు ఆ క్లాత్‌తో చిన్న చిన్న పోట్లీ బ్యాగ్‌లు, పర్సులు తయారు చేసుకుంటారు. అలా కూడా పనికి రాని సన్నగా పొడవుగా రిబ్బన్ ముక్కల్లాంటి క్లాత్‌ని ఒక స్కూల్‌కి ఇస్తే వాళ్లు పిల్లల చేత డోర్‌మ్యాట్ మేకింగ్ వంటి క్రాఫ్ట్ ప్రాక్టీస్‌కి ఉపయోగిస్తున్నారు. ఇక ఎందుకూ పనికిరావనిపించే ముక్కలను ఒక కవర్‌లో జమ చేసి ఆ బొటీక్‌లో పని చేసే వాళ్లు దిండులో స్టఫింగ్‌గా నింపుకుంటారు. వ్యర్థాన్ని అర్థవంతంగా మారుస్తున్న సుదీప తన బొటీక్‌లో చిన్న ముక్క కూడా నేల పాలు కాకుండా ప్రయత్నం చేస్తున్నారు.

షాపింగ్ వ్యసనం



ఈ తరానికి షాపింగ్ ఒక వ్యసనంగా మారింది. యూఎస్, యూరప్‌ల నుంచి వాడిన దుస్తులు మూడవ ప్రపంచదేశాలకు డంప్ అవుతున్నాయి. అరేబియా షిప్పుల్లో గుజరాత్ తీరం నుంచి దేశంలోకి వస్తుంటాయవి. మన దగ్గర తయారయ్యే పాలియెస్టర్ వస్త్రాలకు తోడు ఆయాఖండాల నుంచి వచ్చిపడుతున్న దుస్తులు కూడా కలిసి డంప్ పెరిగిపోతోంది. పాలియెస్టర్ వస్త్రాలను ఫైబర్‌గా మార్చి కొత్త దుస్తులు తయారు చేసే క్రమంలో విడుదలయ్యే వ్యర్థాలు సముద్రాల్లోకి చేరి మైక్రోప్లాస్టిక్‌గా మారి తిరిగి మన మీదనే దుష్ప్రభావాన్ని చూపిస్తాయి. అలాగే పారేస్తున్న దుస్తులతో కాలువలు నిండిపోతున్నాయి.

- డాక్టర్ దొంతి నరసింహారెడ్డి, పర్యావరణ నిపుణులు

ఉత్పత్తి- కొనుగోలు పెరిగాయి

మనం కొంతకాలం వాడి ఇక పనికి రావని పారేస్తున్న వస్తువులు నిజానికి పనికిరానివి కాదు, వాటిని మరొక రకంగా మలుచుకుని ఉపయోగించుకోవడం మనకు చేతకాకపోవడమే. రీ యూజ్ చేయడం నేర్చుకోవాలి. నాచురల్ ఫైబర్‌తో వస్త్రాలు తయారుచేసినన్ని రోజులు వస్త్ర పరిశ్రమ, అనుబంధ పరిశ్రమల వ్యర్థాల గురించి మాట్లాడాల్సిన అవసరం రాలేదు. మ్యాన్‌మేడ్ ఫైబర్ ప్రవేశించిన తర్వాత ఎదురవుతున్న సమస్యలివన్నీ. నిజానికి వ్యర్థాల ఉత్పత్తి మనదేశం లోకంటే యూఎస్, యూరప్‌దేశాల్లో చాలా ఎక్కువ. అవసరానికి మించి ఉత్పత్తి చేయడం, అవసరానికి మించి కొనడం రెండూ పెరిగాయి.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

మార్చి 30 జీరో వేస్ట్ డే

జీరో వేస్ట్‌తో ద బెస్ట్



● కంపోస్ట్ తయారీలో సొసైటీ సభ్యులు

ప్లాస్టిక్, ఆహార వ్యర్థాలు, ఎలక్ట్రానిక్ పరికరాల వేస్ట్‌తో ఏటా ప్రపంచ వ్యాప్తంగా రెండు వందల కోట్ల టన్నుల చెత్త జమవుతోంది. ఇది పెరుగుతూ భూగ్రహాన్ని ముంచేసినా ఆశ్చర్యం లేదు. ఈ ప్రమాదాన్ని మన దేశంలో ముందుగా గ్రహించి అప్రమత్తమైన ప్రాంతం ఢిల్లీ, మాల్వీయ నగర్‌లోని నవజీవన్ విహార్ రెసిడెన్షియల్ సొసైటీ. రీయూజ్, రీసైకిల్‌ను ఫాలో అవుతూ జీరో వేస్ట్‌తో పర్యావరణప్రియమైన ప్రాంతాల్లో ఒకటిగా నిలిచింది.

దాదాపు ఏడేళ్ల కిందట... ఢిల్లీ మునిసిపల్ కార్పొరేషన్ మాల్వీయనగర్‌లో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ మీద ఒక వర్క్‌షాప్ నిర్వహించింది. అందులో పాల్గొన్న నవజీవన్ విహార్ రెసిడెన్షియల్ సొసైటీ సభ్యులు ఆ వర్క్‌షాప్‌లో చెప్పినవి, చూపించినవి తమ కాలనీలో అమలు చేయడం మొదలుపెట్టారు. అక్కడ 250 ఇళ్లున్నాయి. ఉదయాన్నే ఇంటింటికి వెళ్లి తడి చెత్త, పొడి చెత్తను ఎలా వేరుచేయాలో వివరించి, కొన్నాళ్లపాటు పర్యవేక్షించారు సొసైటీ సెక్రటరీ, కంటివైద్యులు డాక్టర్ రూబీ మఖీజా. తతిమా సభ్యుల సహాయసహకారాలతో తడిచెత్తతో కాలనీలోనే కంపోస్ట్ తయారుచేయడం మొదలుపెట్టారు. ఆ ఎరువుతో కిచెన్, బాల్కనీ, రూఫ్ గార్డెన్స్‌ను ప్రోత్సహించారు. ఒక షెడ్డు లాంటిదీ ఏర్పాటు చేశారు.. ఇళ్లల్లో పాతపుస్తకాలు, దుస్తులు, ఆటబొమ్మలు, ఉపయోగంలో లేని వస్తువుల కోసం. ఆ కాలనీలో ఎవరికైనా ఏ వస్తువైనా అవసరం ఉంటే ముందు ఈ షెడ్డుకొచ్చి చూసి, అందులో తమకు కావలసింది లేకపోతేనే కొత్తది కొనుక్కోవాలి. అలా కాలనీ వాసులు తీసుకున్నవి పోనూ మిగిలినవి స్వచ్ఛంద సంస్థలకు ఇస్తారు అవసరమైన వాళ్లకు పంచేందుకు! ఈ కాలనీలో ప్లాస్టిక్ బ్యాన్. గుడ్డ సంచులనే వాడుతారు. నీటి వృథా, అదానూ సమర్థవంతంగా నిర్వహించుకుంటున్నారు. పిల్లలకు పర్యావరణం పట్ల అవగాహన కలిగించడానికి వారానికోసారి క్యాంప్ పెడతారు. అందులో పిల్లలను ఆడిస్తూ, పాడిస్తూ వాళ్లు ఎలక్ట్రానిక్ పరికరాలకు బానిసలు కాకుండా జాగ్రత్తపడుతున్నారు. వీళ్లో బ్రాడ్‌కాస్ట్ సిస్టమ్‌నూ ఏర్పాటు చేసుకున్నారు. ప్రతిరోజూ కాలనీలో జరిగే పర్యావరణపరిరక్షణ కార్యక్రమాలను వీడియోలుగా తీసి వాటిని సాయంకాలం ప్రసారం చేస్తారు. ఈ ప్రయత్నాలతో జీరో వేస్ట్‌లో దేశానికే స్ఫూర్తిగా నిలిచింది నవజీవన్ విహార్.